సాక్షి హనుమకొండ

మంగళవారం । 15 । ఏప్రిల్ । 2025



ఎంజీఎంలో ఎక్స్‌రే కష్టాలు

ఎంజీఎంలో మూడు రోజులుగా ఎక్స్ రే సేవలు నిలిచిపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో▸



ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిన అంబేద్కర్

దేశ ఔన్నత్యం, ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన మహనీయుడు అంబేద్కర్ అని మంత్రి కొండా సురేఖ అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

37^0 /24^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉండనుంది. సాయంత్రం ఉక్కపోత ఉంటుంది.

న్యూస్‌రీల్

సీఎం సమావేశంలో కలెక్టర్లు





వరంగల్: హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో వరంగల్, హనుమకొండ కలెక్టర్లు డాక్టర్ సత్యశారద, ప్రావీణ్య పాల్గొన్నారు. ఈసమావేశంలో భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, వేసవి తాగు నీటి ప్రణాళికలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ



ఖిలా వరంగల్: వేసవిలో అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం వరంగల్ శివనగర్‌లోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఈ నెల 14 నుంచి 20వరకు నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను మేయర్ గుండు సుధారాణి, ఏసీపీ నందిరామ్‌నాయక్, డీఎఫ్‌ఓ కేవీ సతీశ్‌కుమార్, ఎస్‌ఎఫ్‌ఓ రాజేశ్వర్‌రావుతో కలిసి ఆవిష్కరించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. కార్యక్రమంలో జమేదార్ మాధవరెడ్డి, నవీన్‌రాజు, మీసాల ప్రకాశ్, కార్పొరేటర్ సామిశెట్టి ప్రవీణ్ పాల్గొన్నారు.

మృత పిండం అప్పగింత



ఎంజీఎం: నగరంలోని రైల్వే గేట్ సమీపంలో కేవీఎస్ రెసిడెన్సీ నివాసి అయిన భావన గర్భంలో పెరుగుతున్న 6 నెలల పిండంలో ప్రమాదకరమైన వ్యాధిని గుర్తించిన వైద్యులు తల్లికి అపాయం జరుగుతుందని పిండాన్ని తొలగించారు. తల్లిదండ్రులు సమాజ హితం కోరి కేఎంసీ వైద్య విద్యకు దానం చేయడానికి ముందుకు వచ్చారు. తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ వరంగల్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి ఆదేశంతో కళాశాల అనాటమీ విభాగానికి మృత పిండాన్ని అప్పగించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు మునిగాల పద్మ, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు మల్లారెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్ రెన్యువల్ పనులు


కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే స్టేషన్‌లో సోమవారం రైల్వే ఇంజినీరింగ్ అధికారులు ట్రాక్ రెన్యువల్, మరమ్మతు పనులు చేపట్టారు. ముందస్తుగా ఎలాంటి సాంకేతిక సమస్య తలెత్తకుండా ట్రాక్‌ను తనిఖీ చేసి మరింత సమర్థవంతంగా ఉండేందుకు యంత్రాల సాయంతో మరమ్మతు పనులు చేపడుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

చనిపోయిన వ్యక్తి భూకబ్జా చేశాడట!


తొమ్మిదేళ్ల క్రితం మరణించిన వ్యక్తిపై కేసు

ఎఫ్ఐఆర్‌లో ఏ-1గా నమోదు..

- కాసులకు కక్కుర్తి.. నిబంధనలకు నీళ్లు
- చోద్యం చూస్తున్న పోలీసు ఉన్నతాధికారులు
- ఆ స్టేషన్‌లో వాళ్లది ఇష్టారాజ్యం!







చనిపోయిన వ్యక్తిపై నమోదైన ఎఫ్ఐఆర్



కేసు నమోదైన వ్యక్తి డెత్ సర్టిఫికెట్

వరంగల్ క్రైం:

చనిపోయిన వ్యక్తి వచ్చి భూ కబ్జా చేసినట్లు కేసు నమోదు చేసిన పోలీసుల్ని వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చూడొచ్చు. 9 ఏళ్ల క్రితం చనిపోయిన వ్యక్తి లేచి వచ్చి అక్రమంగా భూమిలోకి చొరబడి, బెదిరింపులకు పాల్పడినట్లు వరంగల్ సబ్ డివిజన్ పరిధిలోని ఓ పోలీస్ స్టేషన్‌లో ఏ-1 కింద కేసు నమోదు చేశారో పోలీస్ అధికారి. సివిల్ కేసుల్లో తలదూర్చవద్దని పోలీస్ ఉన్నతాధికారులు మొత్తుకుంటున్నా.. కొందరు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనేందుకు ఇదో ఉదాహరణ. భూదందాలకు చిరునామాగా మారిన ఆ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతర్ చేస్తూ.. తనకు నచ్చని వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు, ఆపోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడనే ప్రచారం సాగుతోంది. ఇటీవల ఓ కేసులో రెండు వర్గాలు రాజీకుదుర్చుకోగా.. రాజీ పడవద్దని ఒత్తిడి చేసి వివాదాస్పదుడిగా పేరు మూటగట్టుకున్నట్లు తెలుస్తోంది.

చనిపోయిన వ్యక్తిపై కేసు..

ఆ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది జనవరి 21న కొంత మంది వ్యక్తులు తన భూమిలోకి అక్రమంగా చొరబడి, హద్దు రాళ్లను పీకేసి ప్లాట్ల యజమానులను చంపుతామని బెదిరించినట్లు ఓ మహిళ ఆ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎలాంటి విచారణ చేయకుండానే అదే రోజు పిటిషనల్‌లో పేర్కొన్న వ్యక్తులపై కేసు నమోదైంది. ఎఫ్ఐఆర్ నంబర్ 47/2025 లో ఏ-1గా ఉన్న బత్తిని చంద్రశేఖర్ చనిపోయి సుమారు తొమ్మిదేళ్లవుతోంది. ఎఫ్ఐఆర్ కాపీ చూసిన అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. చనిపోయిన వ్యక్తి ఎక్కడినుంచి వచ్చి అక్రమంగా భూమిలోకి ప్రవేశించి.. హద్దు రాళ్లు పీకేసి చంపుతానని బెదిరిస్తాడని ప్రశ్నిస్తున్నారు. మృతుడి బంధువులు అడిగితే నా ఇష్టం వచ్చిన వారిపై కేసు నమోదు చేస్తా. అవసరం అయితే నీపై (ప్రశ్నించిన వ్యక్తిపై) కేసు పెడతానని సదరు అధికారి బెదిరింపులకు దిగాడు. దీంతో చేసేదేమీ లేక బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వారు కూడా ఏమీ చేయలేక సదరు అధికారిపై చిరుకోపం ప్రదర్శించి చేతులు దులుపుకున్నట్లు సమాచారం. మిస్సింగ్, చిన్న చిన్న చీటింగ్ కేసులు పెట్టే ముందు ఒకటికి రెండుసార్లు ఉన్నతాధికారులకు ముందస్తు సమాచారం ఇచ్చి.. అవసరం అయితే వారు చెప్పిన సెక్షన్లు వచ్చేలా కేసులు నమోదు చేయడం పోలీస్ స్టేషన్లలో అనవాయితీ. అలాంటిది ఫిర్యాదు వచ్చీ రాగానే.. కనీసం అవతలి వ్యక్తులపై ఎలాంటి విచారణ లేకుండానే, వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలవకుండానే కేసులు నమోదు చేయడం సదరు అధికారికే చెల్లింది. బాధితుల భూమికి, ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన సర్వే నంబర్లకు ఎలాంటి సంబంధం లేకపోవడం గమనార్హం.

విచారించకుండానే..

చట్ట ప్రకారం.. పోలీస్‌స్టేషన్లలో భూదందాలకు సంబంధించిన కేసులు పట్టించుకోవద్దు. ఏది ఉన్నా న్యాయస్థానాల్ని సంప్రదించాలని సలహా ఇవ్వాలి. పోలీస్ స్టేషన్లలో తాటికాయలంత అక్షరాలతో 'ఇక్కడ భూ సమస్యలు పరిష్కరించబడవు. సివిల్ తగదాలకు పరిష్కారం లేదు' అని రాసి ఉంటుంది. అలాంటిది ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కనీసం విచారణ జరపకుండా రెండు వర్గాల అభిప్రాయాలు తెలుసుకోకుండా చేతిలో అధికారం ఉందని, కాసుల కక్కుర్తితో చనిపోయిన వ్యక్తిపై కేసులు నమోదు చేసి నిబంధనలకు నీళ్ల వదిలారు. ఈ ఒక్క ఘటన వెలుగులోకి రాగా.. ఇలాంటి వెలుగు చూడని ఘటనలు మరెన్ని ఉన్నాయోననే అనుమానాలు కలుగుతున్నాయి. కాసులకు కక్కుర్తి పడే కొంత మంది పోలీసు అధికారుల కారణంగా వరంగల్ కమిషనరేట్ పోలీసుకున్న ఘన చరిత్ర మసకబారుతోందన్న ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి శవాలపై కేసులు పెట్టే సదరు అధికారి అక్రమ దందాలపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని, బాధితులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రహరీ.. పనులేవి?

కేయూలో ముందుకు సాగని కాంపౌండ్ వాల్ నిర్మాణం

- ఆక్రమణల అడ్డుకట్టకు గోడనే మార్గమని నిర్ణయం
- పనులు మొదలుపెట్టి ఆపేసిన కాంట్రాక్టర్
- మళ్లీ రూ.20కోట్లతో రివైజ్డ్ ఎస్టిమేషన్
- గత 'కాంట్రాక్ట్'ను క్యాన్సిల్ చేసే యోచన?
- ఇంకా తేలని యూనివర్సిటీ భూమి.. బయటికి రాని నివేదిక

కాకతీయ యూనివర్సిటీ భూముల ఆక్రమణకు అడ్డుకట్ట వేసేందుకు చేపట్టిన ప్రహరీ నిర్మాణం ముందుకు సాగడం లేదు. ఇప్పటికే పలుమార్లు సర్వే చేసి యూనివర్సిటీ భూములు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. వీటిపై ఎలాంటి చర్యలూ లేకపోగా, సరిహద్దులు గుర్తించి భవిష్యత్‌లో ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు చుట్టూ ప్రహరీ నిర్మించాలనుకున్నారు. మొదట వేసిన ఎస్టిమేషన్ ప్రకారం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ వివిధ కారణాలతో పనులు చేపట్టలేదు. దీంతో మరోసారి రివైజ్డ్ ఎస్టిమేషన్ వేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. – కేయూ క్యాంపస్



కేయూ భూమిలో హద్దులు నిర్ణయించి మార్కింగ్ ఇస్తున్న సంబంధిత అధికారులు సిబ్బంది (ఫైల్)

కాకతీయ యూనివర్సిటీ ఆవిర్భావంలోనే 672 ఎకరాలకు అప్పట్లో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చి భూమిని సేకరించారు. భూమి ఆక్రమణకు గురవుతుందన్న సమాచారంతో కొంత కాలం క్రితం కేయూ పాలకమండలి సభ్యుడిగా కొనసాగిన డాక్టర్ నాగేంద్రబాబు పలు రికార్డులను సేకరించారు. చివరి నివేదికలో 666 ఎకరాలు ఉందని ఇచ్చారు. కానీ ఇప్పటికీ ఆ నివేదికను బయటకు వెల్లడించలేదు. అదేవిధంగా 2022లో జిల్లాభూమి కొలతల అధికారులు డిజిటల్ గ్లోబల్ ఫిజికల్ పొజిషన్ సర్వే ద్వారా 622 ఎకరాలు ఉన్నట్లు నివేదిక ఇచ్చారు.

పలుచోట్ల ఆక్రమణలు..

కాకతీయ యూనివర్సిటీలో 229 సర్వేనంబర్‌లో 8మంది ఇళ్లు, మరో ముగ్గురి ప్లాట్లు ఉన్నాయనేది ఇటీవల విజిలెన్స్ అధికారుల సమక్షంలో నిర్వహించిన సర్వేలో గుర్తించి హద్దులు నిర్ణయించారు. ఎకరం పది గుంటలు ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించారు. అదేవిధంగా పలివేల్పుల వైపు కూడా ఆక్రమణలున్నట్లు గుర్తించారు. డబ్బాలవైపు సర్వే నంబర్ 60, 214లో కలిపి 600 గజాలు, 413 సర్వే నంబర్‌లో ఎకరం 5గుంటల భూమి తనదేనని ఓ ప్రైవేట్ వ్యక్తి, యూనివర్సిటీదేనని అధికారులు వాదిస్తుండగా ఈ కేసు కోర్టులో ఉంది.

ప్రహరీ నిర్మాణం మొదలెప్పుడో?

ప్రహరీ లేకపోవడంతోనే ఆక్రమణలు జరుగుతున్నట్లు భావించిన అధికారులు రూ.10కోట్లు వెచ్చించి నిర్మించేందుకు ఓ సంస్థకు అప్పగించారు. టెండర్ పిలిచి కాంట్రాక్టర్‌కు అప్పగించారు. పూర్తిస్థాయిలో కాకుండా కొంతభాగానికి టెండర్ పిలిచినట్లు సమాచారం. సదరు కాంట్రాక్టర్ ఒకటి, రెండుచోట్ల చెట్లను కొట్టి చదును చేశారు. ఆ తర్వాత వివిధ కారణాలతో పనులు ఆపేశారు. ఈ క్రమంలో గోడ నిర్మాణానికి మళ్లీ కేయూ బిల్డింగ్ డివిజన్ రివైజ్డ్ ఎస్టిమేషన్ వేసింది. రూ.20కోట్ల వ్యయంతో 10.5 కిలోమీటర్ల మేర నిర్మించాలని నిర్ణయించి పాలకమండలి దృష్టికి తీసుకెళ్లింది. ఈ విషయం ప్రస్తుతం పాలకమండలి వద్ద ఉంది.

విజిలెన్స్ అధికారుల సమక్షంలో మళ్లీ సర్వే, హద్దుల నిర్ణయం

విజిలెన్స్ అధికారుల సమక్షంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు, కేయూ అభివృద్ధి అధికారుల సిబ్బంది బృందం కలిసి గత ఏడాది సెప్టెంబర్‌నుంచి ప్రారంభమైన సర్వే పలు అడ్డంకులతో ఈ ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగింది. గత నెలలో ఎస్సారెస్పీ కాల్వ ప్రాంతంలోనూ యూనివర్సిటీ భూముల హద్దులు నిర్ణయించారు. రెవెన్యూ సర్వేయర్ల ద్వారా సర్వే చేయిస్తూ హద్దులను నిర్ణయిస్తూ మార్కింగ్ కూడా చేశారు. పలు చోట్ల ఆక్రమణలు వెలుగు చూశాయి. ఈ సర్వే పూర్తయి నెలరోజులు గడిచినట్లు యూనివర్సిటీ అధికారులు చెబుతున్నారు. ఈ నివేదిక యూనివర్సిటీ అధికారులకు అందాల్సి ఉంది. అప్పుడే ఎన్ని ఎకరాలు ఉన్నది అనేది స్పష్టంగా తెలిసే అవకాశం ఉంటుందని యూనివర్సిటీ అధికారులు అంటున్నారు.

నివేదిక వచ్చాక ప్రహరీ నిర్మాణం..



కాకతీయ యూనివర్సిటీ భూములకు సంబంధించి గత కొన్నినెలల క్రితం విజిలెన్స్ అధికారుల సమక్షంలో రెవెన్యూ సర్వేయర్లతో సర్వే జరిగింది. అన్నిచోట్ల హద్దులను నిర్ణయించి మార్కింగ్ చేశారు. యూనివర్సిటీ భూమిపై నివేదిక రావాల్సి ఉంది. వారంరోజుల్లో వస్తుందని భావిస్తున్నాం. నివేదిక వచ్చాక గతంలో నిర్ణయించినట్లు కాకుండా ఇటీవల వేసిన రివైజ్డ్ ఎస్టిమేషన్ రూ.20కోట్లతో చుట్టూ హద్దుల ప్రకారం గోడ నిర్మిస్తాం. గతంలో ఇచ్చిన కాంట్రాక్టును సైతం క్యాన్సిల్ చేయించాల్సింది. మళ్లీ మరో సంస్థకు అప్పగించాలనే ఆలోచన చేస్తున్నాం.

– ఎస్.వాసుదేవరెడ్డి, కేయూ అభివృద్ధి అధికారి

అంబేద్కర్ విగ్రహం వద్ద ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ పి.ప్రావీణ్య, మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, మేయర్ సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తదితరులు



రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అందరివాడు

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

హన్మకొండ: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ అందరి వాడని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం హనుమకొండలోని ఆయన విగ్రహానికి ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ పి.ప్రావీణ్య, నగర మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ అధికారి శ్రీలత, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రు పాషా, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, అధికారులు, ప్రజా సంఘాల నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ఆధారంగానే తమకు ఎంపీ, ఎమ్మెల్యేలుగా అవకాశాలు లభించాయన్నారు. ఆయన ఆలోచన విధానాన్ని గ్రామాల్లోని చివరి ఇంటి వరకూ తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు కలిసి రావాలి..

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

- వివరాలు 8లో▸

ప్రపంచం మెచ్చిన మేధావి అంబేడ్కర్

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఈటల రాజేందర్

కమలాపూర్: ప్రపంచం మెచ్చిన మహా మేధావి భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కొనియాడారు. సోమవారం ఆయన కరీంనగర్ జిల్లా ఇల్లందకుంటకు వెళ్తూ మార్గమధ్యలో కమలాపూర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలను ప్రపంచంతోపాటు దేశవ్యాప్తంగా గొప్పగా నిర్వహించుకున్నారన్నారు. దేశంలో గొప్ప రాజకీయ పరిజ్ఞానం ఉన్న నాయకుడిగా మాత్రమే కాకుండా మహా మేధావిగా పేరు తెచ్చుకున్న అంబేడ్కర్ ఆశయాలను యువత మదిలో పెట్టుకోవాలన్నారు. దేశాన్ని ముందుకు తీసుకెళ్లడంలో తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. ఆయన స్ఫూర్తితో రాజకీయ పార్టీలు, నాయకులు ముందుకెళ్లాలన్నారు. అనంతరం రాత్రి కమలాపూర్ రామాలయంలో ఈటల రాజేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం పెద్ద రథోత్సవం జరగనుండగా పెద్ద రథాన్ని భక్తులు, కార్యకర్తలతో కలిసి బయటకు లాగారు. కార్యక్రమంలో మహనీయుల జయంత్యుత్సవ కమిటీ అధ్యక్షుడు పుల్ల కొంరయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్, నాయకులు మాట్ల రమేష్, శోభన్, అరవింద్, రత్నాకర్, శ్రీనివాస్, సదానందం, రామస్వామి, సుధాకర్, అనిల్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 11: హనుమకొండలోని గాంధీనగర్ పోచమ్మ గుడి సమీపంలోని షామా డిస్ట్రిబ్యూటరీలో ఎక్స్‌పైరీ తేదీలు ముద్రించకుండానే ఐస్‌క్రీమ్‌లు ప్యాక్ చేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. టాస్క్‌ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడి చేసి నిబంధనలు పాటించకుండా ఐస్‌క్రీమ్ తయారు చేస్తున్న నిర్వాహకులను పట్టుకున్నారు. రూ.25,740 విలువైన ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని నిర్వాహకుడు మొహమ్మద్ జాన్ పాషాను అదుపులోకి తీసుకున్నారు.

ఏప్రిల్ 12: మడికొండలోని కనకదుర్గ కాలనీలో ఓంకార్ ఐస్ క్రీమ్ డిస్ట్రిబ్యూటరీలో టాస్క్‌ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడి చేశారు. తయారీ, ఎక్స్‌పైరీ తేదీలు ముద్రించకుండా అమ్మకానికి సిద్ధంగా ఉంచిన రూ.2,39,476 విలువైన ఐస్ క్రీమ్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు వొల్లాల రవీందర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఏప్రిల్ 14: వరంగల్ బాలాజీనగర్‌లోని కూల్ టచ్ ఐస్ క్రీమ్ కంపెనీలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. నియమాలు పాటించకుండా, తయారీ, ఎక్స్ పైరీ తేదీలు ముద్రించకుండా, లైసెన్స్ లేకుండా అమ్మకానికి సిద్ధంగా ఉంచిన రూ.83,200ల విలువైన ఎనిమిది రకాల ఉత్పత్తులను గుర్తించారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్ కుమార్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కృష్ణమూర్తి సంయుక్తంగా దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు అల్లిపురం శ్రీపాల్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని తదుపరి విచారణ కోసం ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు.

చల్లని విషం!

నిబంధనలు పాటించని 'ఐస్' కంపెనీలు

- అపరిశుభ్ర వాతావరణం.. కెమికల్స్ వినియోగం
- తయారీ, ఎక్స్‌పైరీ తేదీలు లేకుండానే విక్రయాలు
- టాస్క్‌ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులతో వెలుగులోకి



నగరంలో సోమవారం పట్టుబడిన నాసిరకం ఐస్‌క్రీం ఉత్పత్తులను చూపిస్తున్న అధికారులు

సాక్షి, వరంగల్: అసలే ఎండాకాలం.. ఆపై చల్లటి ఐస్ క్రీమ్.. రోడ్డుపై వెళ్తుంటే కనిపిస్తే చాలు తినకుండా ఎవరైనా ఉండగలరా? ఎండల నుంచి ఉపశమనానికని కొందరు, అలవాటుగా మరికొందరు ఐస్ క్రీమ్‌లు తినేస్తుంటారు. దీంతో వేసవి మూడు నెలలు ఐస్‌క్రీమ్‌లకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ఈ డిమాండ్‌ను కొంత మంది క్యాష్ చేసుకోవాలని చూస్తున్నారు. ఇందుకు ఇటీవల నగరంలో అధికారుల తనిఖీల్లో బహిర్గతమైన ఘటనలే నిదర్శనం. నగరంలోని కొంతమంది నిబంధనలు పాటించకుండా ధనార్జనే ధ్యేయంగా ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్నారు.

నిబంధనలు పాటించకుండానే..

కొన్ని ఐస్‌క్రీమ్ కంపెనీలు ఎక్స్‌పైరీ తేదీలను ఐస్‌క్రీమ్ ప్యాక్‌పై ముద్రించడం లేదు. అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేస్తున్నట్లుగా ఇటీవల టాస్క్ ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ అధికారుల సంయుక్త దాడుల్లో తేలింది. హానికారక, ప్రమాదకర కెమికల్స్ వినియోగిస్తున్నట్లుగా గుర్తించారు. ఆకర్షణీయంగా మెరిసేందుకు కెమికల్స్ వాడుతున్నట్లు గుర్తించారు. ఈ కెమికల్స్ రక్తనాళాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని వైద్యులు చెబుతున్నారు. ఈ కల్తీ ఐస్ క్రీమ్ తినడం వల్ల చాలామంది అనారోగ్యం బారిన పడుతున్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని ఐస్‌క్రీమ్‌లు కొనేముందు అన్నీ చెక్ చేసుకోవాలని పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు చెబుతున్నారు. అయితే టాస్క్ ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా కలిసి దాడి చేసి ఆహర కల్తీ పదార్థాలు పట్టుకున్న కేసులు నాలుగు నెలల్లో పది కేసులు నమోదైతే ఐదు కేసుల వరకు కల్తీ ఐస్ క్రీమ్‌లవే ఉండడం గమనార్హం. ఈఐదు కేసుల్లో రూ.8,69,000 కల్తీ ఐస్‌క్రీం ఉత్పత్తులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

పిల్లలే టార్గెట్!

సెలవుల సమయం, ఒంటిపూట బడులు ఉండడంతో పిల్లలనే టార్గెట్ చేస్తూ కొంతమంది బిజినెస్ చేస్తున్నారు. కల్తీ, నాసిరకం ఐస్‌క్రీమ్‌లు అమ్ముతున్నారు. వీధుల్లో తిరిగే బండ్ల వద్ద, షాపుల్లో కృత్రిమ రంగులతో తయారు చేసిన, కల్తీ నీరు, రసాయనాలతో తయారు చేసిన ఐస్‌క్రీంలు విక్రయిస్తున్నారు. ఇవి తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని, పిల్లల్లో ఎదుగుదల లోపిస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అనుమానమొస్తే కాల్ చేయండి..



ఐస్‌క్రీం కవర్లపై బ్రాండెడ్ ఐస్ క్రీమ్ కంపెనీ లేబుల్స్ ఉంటాయి. లోపల నాసిరకం సరుకు ఉంటుంది. ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా కల్తీ చేసిన ఐస్ క్రీమ్స్‌ను మార్కెట్‌లో మోసగాళ్లు అమ్మేస్తున్నారు. ఐస్‌క్రీం కప్పులు, కవర్లపై తయారీ, ఎక్స్‌పైరీ తేదీలు లేకపోయినా, రుచిలో తేడా వచ్చినా 99858 20544 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

– కృష్ణమూర్తి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, వరంగల్

రైతు పండించిన ప్రతీ గింజ కొంటాం..

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



పరకాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల: రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను గిట్టుబాటు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని అన్నారు. సోమవారం పరకాల మండలం నాగారం గ్రామంలో డీఆర్‌డీఏ, ఎస్ఈఆర్‌పీ పౌరసరఫరాల శాఖ, ప్రగతి గ్రామ సమైఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రంతోపాటు పరకాల వ్యవసాయ మార్కెట్ ఆవరణలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో శ్రమించి ధాన్యం అమ్ముకోవడానికి వచ్చే రైతులకు కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎటువంటి కటింగ్ లేకుండా కొనుగోలు చేయాలని అధికారులకు ఆయన స్పష్టం చేశారు. సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తుందని, ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం 17శాతం తేమశాతం ఉండేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, ఏఓ శ్రీనివాస్, ఐకేపీ ఏపీఓ క్రాంతి, మాజీ ఎంపీపీ స్వర్ణలత, కాంగ్రెస్ పార్టీ పరకాల పట్టణ, మండల అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్, కట్కూరి దేవేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు..

● వివాహిత నవ్య బలవన్మరణంపై కేసు నమోదు



నవ్య (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నర్సంపేట బైపాస్ రోడ్‌లో ఆదివారం రాత్రి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన నవ్య మృతిపై ఆమె తండ్రి ఉత్తరాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ సోమవారం రాత్రి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని బ్రాహ్మణ బజార్‌కు చెందిన శ్రీపాద ఉత్తరాచారి పెద్ద కుమార్తె నవ్య (21)ను ఇల్లందు మండలం ధర్మారం తండాకు చెందిన తాడూరి భిక్షమాచారి, సత్యవతి దంపతుల కుమారుడు రవిచంద్రాచారికి ఇచ్చి గతేడాది డిసెంబర్ 26వ తేదీన వివాహం జరిపించారు. వివాహం సమయంలో రూ.50 వేలు కట్నం ఇచ్చారు. భర్త రవిచంద్రాచారి, అత్తామామ భిక్షమాచారి, సత్యవతి తరచూ అదనపు కట్నం కోసం నవ్యను వేధింపులకు గురిచేస్తుండేవారు. ఈ క్రమంలో పలుమార్లు పంచాయితీలు జరగగా అదనపు కట్నం డబ్బులు తర్వాత ఇస్తామని ఆపుకుంటూ వచ్చారు. ఆదివారం సాయంత్రం నవ్య తాను ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడుతున్నానని పక్కింటి వారికి చెప్పగా వారు హుటాహుటిన వచ్చి భర్త రవిచంద్రాచారికి చెప్పారు. అప్పటికే ఆమె ఇంట్లోనే ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఉత్తరాచారి ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్సై బి.విజయ్ కుమార్ కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారని సీఐ తెలిపారు.

నేడు నగరంలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ డీఈ జి.సాంబరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంచరకుంట, కుడా కార్యాలయం, చింతల నర్సింహులు బుక్ స్టాల్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, శాంతినగర్, సుబేదారి, పోస్టల్ కాలనీ, ఎక్సైజ్ కాలనీ, అదాలత్ కూడలి, అడ్వొకేట్స్ కాలనీ, హంటర్ రోడ్ ప్రాంతం, జూ పార్కు, వడ్డెపల్లి, విజయపాల్ కాలనీ, రాఘవేంద్ర కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫాతిమానగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వివరించారు.

వరంగల్‌లో..

వరంగల్‌లోని మిల్స్ కాలనీ పోలీసు స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, ఏఎస్‌ఎం కళాశాల, దుర్గేశ్వర స్వామి దేవాలయం ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. పిన్నవారి వీధి ప్రాంతంలో మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు, ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్, విశ్వకర్మ వీధి, జేపీఎన్ రోడ్, ఎల్లంబజార్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

ఎంజీఎంలో ఎక్స్‌రే కష్టాలు..

ఆస్పత్రిలో నిలిచిన ఎమర్జెన్సీ ఎక్స్‌రే సేవలు

- మూడు రోజులుగా ఆ గదికి తాళం
- గాయాలతో క్షతగాత్రుల నరకయాతన, ఆర్తనాదాలు
- పట్టించుకోని ఆస్పత్రి ఉన్నతాధికారులు



తాళం వేసి ఉన్న ఎమర్జెన్సీ ఎక్స్‌రే గది



ఎక్స్‌రే సేవల కోసం స్ట్రెచర్‌పై వచ్చిన క్షతగాత్రుడు (ఫైల్)

ఎంజీఎం : ఉత్తర తెలంగాణ పేద రోగుల పెద్దదిక్కు ఎంజీఎం ఆస్పత్రిలో నిత్యం ఏదో ఒక్క సమస్య తలెత్తుతూనే ఉంది. ఒక రోజు మందులు ఉండవు.. మరో రోజు వైద్యులు రారు. అన్ని బాగున్నాయి.. అనుకున్న క్షణమే పరికరాల్లో సాంకేతిక లోపమంటూ సేవలు అందవు.. ఇలా ఆస్పత్రిలో ఏ విభాగంలో చూసినా ఏదో సమస్య కనిపిస్తూనే ఉంటుంది. ఫలితంగా ఎంజీఎంకు వస్తే పూర్తి స్థాయి వైద్య చికిత్సలు అందుతాయా అనే నమ్మకం రోజురోజుకూ సన్నగిల్లుతోంది. ఈక్రమంలో మూడు రోజుల నుంచి ఆస్పత్రిలో అత్యంత కీలక విభాగమైనా క్యాజువాలిటీలో ఎమర్జెన్సీ ఎక్స్‌రే సేవలు నిలిచాయి. ఈ సేవలను వెంటనే పునరుద్ధరణ చేయాల్సిన అవసరమన్నా రోజులు తరబడిగా పట్టించుకోవడం లేదు. ఫలితంగా క్షతగాత్రులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఒక పక్క ప్రమాదంలో విరిగిన కాళ్లు, చేతులతో ఆస్పత్రిలోని క్యాజువాలిటీ విభాగానికి వస్తే చికిత్స కోసం ఎక్స్‌రే పనిచేయకపోవడంతో ఇక్కడి నుంచి నుంచి ఓపీ బ్లాక్‌లో ఉన్న ఎక్స్‌రే గదికి క్షతగాత్రులను తరలించే సమయంలో వినబడుతున్న ఆర్తనాదాలు అందరినీ కంటతడిపెట్టిస్తున్నాయి.

చికిత్స కోసం తిప్పలు పడాల్సిందే..

ఎమర్జెన్సీ ఎక్స్‌రే పరికరం పనిచేయకపోవడంతో ఈ సేవల కోసం క్షతగాత్రుల బంధువులు తిప్పలు పడాల్సి వస్తోంది. క్షతగాత్రుడిని క్యాజువాలిటీ నుంచి ఓపీ బ్లాక్‌లోని 92 గదికి తరలించేందుకు వీల్ చైర్స్, స్ట్రెచర్స్ దొరకబట్టడానికి కుస్తీ పట్టాల్సిందే. ఆస్పత్రిలోని 92 గది ఎక్కడ అని తెలుసుకునేందుకు మరో ప్రయత్నం చేయాలి. చివరకు అక్కడికి వెళ్లాక ఒకే ఒక్క ఎక్స్‌రే పరికరం పనిచేస్తుండడంతో సేవల కోసం ఎదురుచూడాలి.. ఆ సమయంలో క్షతగాత్రుల రోదనలు చూడలేక సిబ్బందితో వాగ్వాదానికి దిగాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా ఎంజీఎంలో అత్యవసర సేవల కోసం వచ్చిన క్షతగాత్రుల బాధలు నిత్యం పెరిగిపోతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోతున్నారు. ఉన్న ఒకే ఒక్క ఆర్ఎంఓ అన్ని పనులు చక్కబెట్టలేక చేతులేత్తేస్తున్న దుస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా మంత్రులు స్పందించి ఎంజీఎంపై ప్రత్యేక దృష్టి సారించాలని రోగులు వేడుకుంటున్నారు.

> **మరమ్మతులు చేస్తాం..**
> ఎమర్జెన్సీ పరికరంలో సాంకేతిక లోపం ఏర్పడింది. ఎక్స్‌రే సేవలను 92 గదిలోని డిజిటల్ ఎక్స్‌రే ద్వారా అందిస్తున్నాం. ఎమర్జెన్సీ విభాగంలో ఎక్స్‌రే పరికరానికి మరమ్మతులు చేపడుతాం.
> -కిశోర్, సూపరింటెండెంట్

మోటార్లతో నీటిని తోడేశారు



మోటారు ద్వారా నీటిని తోడేస్తున్న రైతు కుటుంబం



ధాన్యం పక్కన నిలిచిన నీటిని తొలగించేందుకు కష్టపడుతున్న రైతు రజిత కుటుంబం

- జనగామ మార్కెట్ ఐకేపీ సెంటర్‌లో రైతుల గోస

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఐకేపీ సెంటర్‌లో ఏ రైతును కదిలించిన కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఆదివారం కురిసిన భారీ వర్షంతో 20వేల బస్తాలకు పైగా ధాన్యం తడిసి పోగా, వరద వెళ్లే దారిలేక ధాన్యం రాశుల పక్కనే నిలిచి ముంచేసింది. నీటిలో మునిగిన ధాన్యాన్ని బయటకు తీసేందుకు రైతులు మోటార్లు పెట్టి తోడాల్సిన పరిస్థితి ఏర్పడింది. జనగామ మండలం చౌడారం గ్రామానికి చెందిన రైతు దండబోయిన రజిత కుటుంబం ఐదు ఎకరాలు సాగు చేయగా, 200 బస్తాల దిగుబడి వచ్చింది. ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకునేందుకు మార్కెట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఐకేపీ సెంటర్‌కు నాలుగు రోజుల క్రితం ధాన్యం తీసుకొచ్చారు. తేమ పేరుతో కొనుగోలు ఆలస్యం కావడంతో అకాల వర్షం 200 బస్తాలను ముంచేసింది. 20 బస్తాలు వరదలో కొట్టుకుపోయాయి. రాత్రి 7.30 గంటల నుంచి సోమవారం ఉదయం 11 గంటలకు వరకు 180 బస్తాల ధాన్యం నీటిలోనే ఉండిపోయింది. దీంతో రైతులు ఇంట్లో వినియోగించే నీటి మోటారును తీసుకొచ్చి కుటుంబమంతా నాలుగు గంటలపాటు కష్టపడి తోడేశారు. ఒక్క అధికారి వచ్చి పలకరించలేదని, టార్పాలిన్ కవర్లు సైతం ఇవ్వలేదని మహిళా రైతు రజిత.. కన్నీరుమున్నీరుగా విలపించారు. 12 గంటలపాటు తడిసిన ధాన్యం మొలకెత్తే పరిస్థితి ఉందని ఆందోళనే వ్యక్తం చేస్తున్నారు.

హాల్ మార్కింగ్ లైసెన్సు రద్దుతో ఇబ్బందులు

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాలుగు, హైదరాబాద్‌లో 18 హాల్ మార్కింగ్ సెంటర్ల లైసెన్సులను తాత్కాలికంగా రద్దు చేయడంతో వినియోగదారులు మోసపోయే అవకాశాలున్నాయని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. సోమవారం వరంగల్ సీతారామ కాంప్లెక్స్‌లో దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి కార్యవర్గ సమావేశం జరిగింది. ప్రధాన కార్యదర్శి మొగిలిచర్ల సుదర్శన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చక్రపాణి మాట్లాడుతూ బంగారు ఆభరణాల నాణ్యతకు ఉద్దేశించిన హాల్ మార్కింగ్ విధానం అమలు కాకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమావేశంలో న్యాయ సలహాదారు సీనియర్ అడ్వకేట్ రాయబారపు భిక్షపతి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావుల రంజిత్‌కుమార్, మిగతా అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

కూలీకి వస్తూ కానరానిలోకాలకు..

- హార్వెస్టర్ కింద పడి మహిళా కూలీ మృతి
- ఒకరికి తీవ్ర గాయాలు
- బూర్నపల్లి శివారులో ఘటన



కనుకమ్మ (ఫైల్)

టేకుమట్ల: కూలీకి వస్తూ ఓ మహిళ కానరానిలోకాలకు వెళ్లింది. హార్వెస్టర్ వెనక్కి వస్తుండగా దాని కింద పడి మృతి చెందింది. ఈ ఘటన సోమవారం సాయంత్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం బూర్నపల్లి శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మొట్లపల్లి గ్రామానికి చెందిన కొంత మంది కూలీలు వరి పంటలో బెరుకుల తీసేందుకు ఆటోలో బూర్నపల్లికి వస్తున్నారు. ఈ క్రమంలో ఆటో ముందు హార్వెస్టర్ వెళ్తుండగా.. ఎదురుగా ఆర్టీసీ బస్సు వస్తోంది. దీంతో హార్వెస్టర్ ఆపరేటర్ బస్సుకు దారి ఇచ్చేందుకు వెనక్కి తీస్తున్నాడు. ఈ క్రమంలో హార్వెస్టర్ వెనుక ఉన్న ఆటోను డ్రైవర్ కూడా వెనక్కి తీస్తుండగా అందులో ఉన్న ఇద్దరు మహిళలు భయంతో కిందికి దిగారు. అయితే హార్వెస్టర్ వారిపైకి ఎక్కింది. ఈ ఘటనలో దాసరి కనుకమ్మ(55) అక్కడికక్కడే మృతి చెందగా, మరో కూలీ వసంతకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వసంతను చికిత్స నిమిత్తం వరంగల్ తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై దాసరి సుదాకర్ ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదంపై వివరాలు సేకరించారు. అనంతరం కనుకమ్మ మృతదేహాన్ని చిట్యాల ఆస్పత్రి మార్చురీకి తరలిచారు.

కన్నీరుమున్నీరైన కూలీలు..

క్షణం ముందు ప్రాణంతో అందరి మధ్య ప్రయాణించిన కనుకమ్మ రెప్పపాటు క్షణంలో విగతజీవిగా మారడంతోపాటు మరో మహిళ తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతుండగా చలించిన తోటి కూలీలు కన్నీరుమున్నీరయ్యారు. సాయంత్రం కూలీకి రాకున్నా బతికేదేమో అని విలపించారు.

ప్రాణాలు తీస్తున్న సాయంత్రం కూలీ..

వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండడంతో వ్యవసాయ కూలీలు ఉదయం, సాయంత్రం రెండు పూటల పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల మండలంలోని రామకిష్టాపూర్(టి) గ్రామానికి చెందిన మహిళా కూలీలు సాయంత్రం వేళ పొలంలోని బెరుకులు తీసేందుకు వెళ్లగా లారీ అదుపు తప్పి మీదపడిన ఘటనలో ఇద్దరు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన మరవక ముందే మొట్లపల్లి నుంచి కూలీలు సాయంత్రం వేళ పొలంలోని బెరుకులు తీసేందుకు వస్తుండగా హార్వెస్టర్ మృత్యుశకటమై కనుకమ్మను కబలించింది.

బావిలోపడి వ్యక్తి..



రాజయ్య (ఫైల్)

నెక్కొండ: వ్యవసాయ బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని వెంకటాపురంలో జరిగింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాళ్లబండి పెద్ద రాజయ్య (56) ఈనెల 13న సాయంత్రం తన పొలం వద్దకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో దారిలో గ్రామానికి చెందిన కొత్తపల్లి వీరారావు వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు కాలు జారి పడ్డాడు. కుటుంబీకులు రాజయ్య కోసం వెతకగా సోమవారం సాయంత్రం బావిలో శవమై తేలి కనిపించాడు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్సై పేర్కొన్నారు. మృతుడి కుమారుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నామని ఎస్సై తెలిపారు.

పెళ్లి బాధ.. చితికి చేర్చింది..

- సంబంధం కుదరడం లేదని యువకుడి బలవన్మరణం



వేణు(ఫైల్)

దుగ్గొండి: ఉన్నత విద్యనభ్యసించాడు. ఎంతకూ పెద్ద ఉద్యోగం రాలేదు. చివరికి ఓ కంపెనీలో చిన్న ఉద్యోగంలో చేరాడు. వచ్చే వేతనం ఖర్చులకూ సరిపోవడం లేదు. మంచి ఉద్యోగం లేదని వచ్చిన పెళ్లి సంబంధాలు రద్దువుతున్నాయి. దీంతో ఓ యువకుడు మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం వెంకటాపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఇంగోళి రాజేశ్వర్‌రావు, పద్మ దంపతుల కుమారుడు వేణు(30) బీటెక్ పూర్తి చేశాడు. ఉద్యోగం కోసం ప్రయత్నాలు సాగించి చివరికి తక్కువ వేతనానికి హైదరాబాద్‌లో ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. అయితే వేతనం ఖర్చులకు సరిపోకపోవడంతో నాలుగు రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. ఈ విషయం తండ్రికి చెప్పడంతో వ్యవసాయం చేసుకుందామని చెప్పి ఓదార్చాడు. వ్యవసాయ పనులు చేయలేక పోయాడు. ఏ పనిచేయలేక తల్లిదండ్రులకు భారంగా మారానని మదనపడుతున్నాడు. ఇదే తరుణంలో వేణుకు అనేక పెళ్లి సంబంధాలు చూశారు. వేణు ఉద్యోగ వివరాలు తెలుసుకున్నాక పెళ్లి కూతురు తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదు. ఇలా మూడు సంబంధాలు రద్దు అయ్యాయి. ఇక తనకు పెళ్లికాదని మనస్తాపంతో తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లిన అనంతరం ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన మృతుడి అమ్మమ్మ లచ్చమ్మ దారి వెంట వెళ్తున్న వారిని పిలిచి విషయం చెప్పి తలుపులు తీయించింది. అప్పటికే వేణు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. కిందికి దించి చూడగా మృతిచెంది ఉన్నాడు. చేతికందొచ్చిన కుమారుడు బలవన్మరణానికి పాల్పడడంతో రాజేశ్వర్‌రావు, పద్మ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

కులనిర్మూలనకు కృషి చేసిన మహనీయుడు అంబేడ్కర్

- టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

హన్మకొండ: సమాజంలో అంటరానితనం, కుల నిర్మూలనకు కృషి చేసిన మహనీయుడు భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ అని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయం ఆవరణలోని స్పోర్ట్స్ క్లబ్‌లో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 150 మంది విద్యుత్ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని సీఎండీ ప్రారంభించారు. అంతకు ముందు అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన, డైరెక్టర్లు, అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ రాజ్యాంగం మనుగడలో ఉన్నంతకాలం అంబేడ్కర్ పేరు చిర స్థాయిలో నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ టీజీ ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు ఎ.ఆనందం, కార్యదర్శి ఎస్.కుమారస్వామి, ఫైనాన్స్ సెక్రటరీ నర్సింహారావు, టీజీ ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, వి.తిరుపతి రెడ్డి, సీజీఆర్ఎఫ్ నిజామాబాద్ చైర్మన్ ఇ.నారాయణ, హనుమకొండ ఎస్ఈ పి.మధుసూదన్ రావు, డి.ఈలు విజేందర్ రెడ్డి, సామ్యనాయక్, జి.సాంబరెడ్డి, ఎస్.మల్లికార్జున్, భిక్షపతి పాల్గొన్నారు.

నువ్వు ఉండి ఏం ప్రయోజనం లేదు చనిపో..

ఆస్తి కోసం తండ్రికి కొడుకు, కోడలు మానసిక వేధింపులు

- మనస్తాపంతో గడ్డి మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య
- కడారిగూడెం గ్రామంలో ఘటన
- పోలీసులకు మృతుడి కూతురు ఫిర్యాదు.. కేసు నమోదు



మల్లేశం(ఫైల్)

వర్ధన్నపేట : ప్రస్తుత సమాజంలో రక్తసంబంధాలు మంటగలుస్తున్నాయని చెప్పడానికి ఈ ఘటనే ఉదాహరణ. ఆస్తి కోసం కన్న తండ్రి అని చూడకుండా కుమారుడు, కోడలు నిత్యం వేధింపులకు గురిచేసి అతడు బలవన్మరణానికి పాల్పడేలా కారణమయ్యారు. పొలం, ఇంటి స్థలాలు, ఇల్లు తమపేర చేయాలని కొద్ది రోజులుగా ఒత్తిడి చేస్తుండగా దీనికి ఆ వృద్ధుడు ససేమిరా అంటున్నాడు. దీంతో మానసికంగా హింసిస్తున్నారు. నువ్వు ఉండి ఏం ప్రయోజనం లేదు మందు తాగి చనిపో అని కోడలు వేధింపులకు గురిచేయడంతో మనస్తాపం చెందిన ఆ వృద్ధుడు గడ్డిమందుతాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కడారిగూడెంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నాంపల్లి మల్లేశం(93)కు నలుగురు సంతానం. చిన్న కుమారుడు కోటేశ్వర్, అతడి భార్య ఎలేంద్ర.. గత కొద్ది రోజులుగా ఆస్తి కోసం నిత్యం వేధిస్తున్నారు. మల్లేశం పేర ఉన్న పొలం, ఇంటి స్థలాలు, ఇల్లు తమపేర చేయాలని మానసిక వేధింపులకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఎలేంద్ర 'నువ్వు ఉండి ఏం ప్రయోజనం లేదు.. మందు తాగి చనిపో' అని మామ మల్లేశంను వేధించింది. దీంతో మల్లేశం ఇంటి వద్ద గడ్డిమందు తాగాడు. గమనించిన రెండో కుమారుడు చంద్రమౌళి వెంటనే 108లో ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతున్న క్రమంలో ఆదివారం రాత్రి 8.20 గంటలకు మల్లేశం చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి కూతురు అమరావతి విజయ ఫిర్యాదు మేరకు చిన్నకుమారుడు కోటేశ్వర్, అతడి భార్య ఎలేంద్రపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చందర్ సోమవారం తెలిపారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిన అంబేడ్కర్

- మంత్రి కొండా సురేఖ
- ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు



శివనగర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

ఖిలావరంగల్: దేశ ఔన్నత్యం, ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రపంచానికి చాటుతూ.. రాజ్యాంగాన్ని రచించిన మహోన్నత రూప శిల్పి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం వరంగల్ 35వ డివిజన్ శివనగర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్ సామిశెట్టి ప్రవీణ్‌తో కలిసి మంత్రి సురేఖ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆలోచనలు, ఉద్యమాలు ఇప్పటికీ మార్గదర్శకం అన్నారు. పౌరుడి నైతికాభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి అని చాటిన మహామేధావి అని కొనియాడారు. కార్యక్రమంలో విగ్రహ ఫౌండేషన్ దాత మెరుగు అశోక్, విగ్రహ దాత రేణుకుంట్ల రవీందర్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పాలేపాక నరేందర్, విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ అధ్యక్షుడు రేణుకుంట్ల శివ, నాయకులు దిడ్డి కుమారస్వామి, మీసాల ప్రకాశ్, కొత్తపెల్లి శ్రీనివాస్, శామంతుల శ్రీనివాస్, గద్దం రవి, శ్రీరాం రాజేశ్, పగడాల సతీశ్ పాల్గొన్నారు.

సమసమాజ స్వాప్నికుడు..

వరంగల్: సమసమాజ స్వాప్నికుడు బీఆర్ అంబేడ్కర్ అని మంత్రి కొండా సురేఖ అన్నారు. అంబేడ్కర్ జయంతి వేడుకలను వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. వరంగల్ కాశిబుగ్గ జంక్షన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి కొండా సురేఖ, బల్దియా మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడతూ.. అంబేడ్కర్ ఆలోచనలు, ఉద్యమాలు ఇప్పటికీ మార్గదర్శకమేనన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కాశిబుగ్గ జంక్షన్ అంబేడ్కర్ విగ్రహానికి నమస్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ

కమిషనరేట్‌లో అంబేడ్కర్ జయంతి

వరంగల్ క్రైం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా నిర్వహించారు. పరిపాలన విభాగం భవనం అవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా ముఖ్యఅతిథిగా పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పరిపాలన విభాగం డీసీపీ రవి, ఏఆర్ అదనపు డీసీపీ సురేష్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

బల్దియాలో 37మందికి నోటీసులు

వరంగల్: అంబేడ్కర్ జయంతి వేడుకలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ ప్ర భుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ, సోమవారం వరంగల్ బల్దియాలో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకలకు 37మంది అధికారులు గైర్హాజర్ కావడంతో కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే నోటీసులను జారీ చేసినట్లు సమాచారం. నోటీలు జారీ అయిన వారిలో ఇంజనీరింగ్ శాఖ ఎస్ఈ ప్రవీణచంద్ర, కాజీపేట డీసీ రవీందర్, ఐదుగురు ఈఈలు, ఏఈలు, అసిస్టెంట్ సిటీ ప్లానర్‌లతో మరికొంత మంది అధికారులు ఉన్నట్లు తెలిసింది. నోటీసులు అందుకున్న 24గంటల్లో తమ సంజాయిషీలను అందించాలని, లేనిపక్షంలో సీసీఏ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకోక తప్పదని కమిషనర్ హెచ్చరించినట్లు తెలిసింది.

డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు కలిసి రావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి. చిత్రంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, గిరిజన ఆర్థిక సహకార సంస్థ చైర్మన్ బెల్లయ్య నాయక్, తదితరులు

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ: డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. అంబేడ్కర్ జయంతి రోజున ఇలాంటి మంచి నిర్ణయం తీసుకోవడంతోపాటు గంజాయి నిర్మూలనకు కృషి చేద్దామన్నారు. సోమవారం హనుమకొండ అంబేడ్కర్ భవన్‌లో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను జరుపుకున్నారు. ముందుగా అంబేడ్కర్ చిత్ర పటానికి ఎమ్మెల్యే నాయిని, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, గిరిజన ఆర్థిక సహకార సంస్థ చైర్మన్ బెల్లయ్య నాయక్, అతిథులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్‌తో పిల్లలుతమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ క్రమంలో ఇక్కడినుంచి వీటి నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డీఈ శ్రీలత, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ నవీన్ కుమార్, డీపీఆర్‌ఓ గంగవరపు వెంకట భానుప్రసాద్, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జగన్‌మోహన్, మహనీయుల ఉత్సవ కమిటీ చైర్మన్ అంకేశ్వరపు రాంచందర్ రావు, వైస్ చైర్మన్ సుకుమార్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పుట్ట రవి, చుంచు రాజేందర్, సింగారపు రవి ప్రసాద్, ఈవీ శ్రీనివాస్ రావు, వివిధ కుల, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.